క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అడ్డతీగల: మండలంలోని పవనగిరి క్షేత్రంలో బుధవారం భువనేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో జరిగిన పూజాధికాల్లో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీమంతం

కొయ్యూరు: రాజేంద్రపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల శ్రమదానం



సుత్తిగూడ కల్వర్టు వద్ద శ్రమదానం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, స్థానికులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సచివాలయ ఉద్యోగులు ప్రజలు పడుతున్న రవాణా కష్టాలపై స్పందించి శ్రమదానం చేశారు.లక్ష్మీపురం పంచాయతీ కేంద్రానికి వచ్చే మార్గంలో సుత్తిగూడ కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొతకు గురైంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దీనిని గమనించిన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శిరీష ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు గిరిజరాణి, మాధవిలు, స్థానికుల సహకారంతో కల్వర్టుపై గోతులు పూడ్చారు. సర్పంచ్ కె.త్రినాథ్‌తో పాటు స్థానికులు సచివాలయ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



పనులు చేయిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రన్నింగ్ వాటర్ సదుపాయం లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించిన పూర్వ విద్యార్థుల వాటర్ ట్యాంక్‌ను పాఠశాలకు బహుకరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.30వేల వ్యయంతో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు ఏర్పాటుచేయించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యురాలుగా ఎంపికైన పూర్వ విద్యార్థిని కూర్మాసుల సూర్యకుమారి ఆధ్వర్యంలో పనులు జరిగాయి. హెచ్‌ఎం గోపాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

జి.మాడుగుల: మండలంలోని లువ్వాసింగి, కిల్లంకోట ప్రాంతాల్లో రైతులకు రాజ్‌మా విత్తనాలను సీఐ సీహెచ్.వెంకటరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ మాలన్న, ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు వేర్వురుగా మాట్లాడుతూ రాజ్‌మా విత్తనాలతో గిరిజన రైతులు వ్యవసాయాభివృద్ధి సాధించాలన్నారు. పండుదొర, రాంబాబు, భీంబాబు, మహిళా పోలీస్ ఉమా, రత్నం పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

జి.మాడుగుల: సొలభం పంచాయతీ తాసరుబయలు గ్రామంలో మత్స్యదేవత ఎఫ్‌పీవో సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సీఈవో సర్పంచ్ ఐసరం హనుమంతరావు వ్యవసాయ శాస్త్రవేత ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగు, ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబర్చాలన్నారు. వారు మాట్లాడుతూ సబ్సీడీపై హార్టికల్చర్ నుంచి ఎఫ్‌పీవోకు ఇచ్చే కలెక్షన్ సెంటర్, కోల్డ్‌స్టోర్స్ ఏర్పాటు, ప్రకృతి సాగు తదితర విషయాలను రైతులకు వివరించారు. ఎఫ్‌పీవో చైర్‌పర్సన్ కళావతి, ఏవో పాత్రుడు, ఎడీఏ విజయలక్ష్మి పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.గోవింద్ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు

- అప్‌గ్రేడ్‌కు నోచుకోని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ
- 70 ఏళ్లుగా ఐదు పడకలకే పరిమితం
- పెరుగుతున్న ఓపీ కేసులు
- పట్టించుకోని అధికారులు



గర్భిణుల సంరక్షణ కేంద్రం



అప్‌గ్రేడ్‌కు నోచుకోని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ

కొయ్యూరు: ఏటా 550కి పైగా ప్రసవాలు.. నెలకు 3,400 నుంచి 3,600 వరకు అవుట్ పేషెంట్(ఓపీ) నమోదు. చుట్టూ వందకు పైగా గ్రామాలు 17 సచివాలయాలు. ఇంతపెద్ద ఎత్తున సేవలు అందిస్తున్న రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాలకుల నిర్లక్ష్యంతో అప్‌గ్రేడ్ కావడం లేదు. రెండున్నర దశాబ్దాల నుంచి ఈ ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా చేస్తామని గుప్పిస్తున్న హామీలు నీటి మీత రాతలుగా మారాయి. 30 పడకల మాట దేవుడికే ఎరుక కనీసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా కూడా అప్‌గ్రేడ్ కాలేదు. ఈ ఆస్పత్రి ప్రారంభించి 70 సంవత్సరాలు దాటినా ఐదు పడకలకే పరిమితమైంది. అరకొర వసతితో రోగులు సతమతమవుతున్నారు.

హామీలకే పరిమితం

రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వివిధ గ్రామాల నుంచి రోగులు ఇక్కడకు వస్తారు. ఓపీ సైతం ఒకో రోజు 150 దాటిపోతుంది.ఈ పీహెచ్‌సీ ప్రాధాన్యతను గుర్తించిన నాటి పాలకులు దీనిని 30 పడకల ఆస్పత్రిగా చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ నేటికి అలానే ఉండిపోయింది. ఏటా ఆస్పత్రికి వచ్చే రోగులు పెరుగుతున్నారు. 2004 వరకు ఈ ఆస్పత్రి యూ.చీడిపాలెం, కంతారం, కృష్ణాదేవిపేటకు సేవలు అందించేది. 2005లో యూ.చీడిపాలెం, కంతారం, కృష్ణాదేవిపేటలో పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు.. నాటి నుంచి కొంత పరిధి తగ్గింది.

పక్క మండలాల నుంచి రోగులు

రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాలకు చెందిన చాలా గ్రామాలు ఈ ఆరోగ్య కేంద్రానికి ఆనుకుని ఉన్నాయి.దీంతో ఆయా గ్రామస్తులు కూడా ఈ పీహెచ్‌సీకే వైద్యం కోసం వస్తారు. ఇక రోగుల సంఖ్యకు తగినట్టుగా సిబ్బంది లేరు. గతంలో ముగ్గురు వైద్యులు ఉంటే ఇప్పుడు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఐదుగురు స్టాఫ్‌నర్స్‌లు ఉండాల్సిన ఈ పీహెచ్‌సీలో నలుగురే ఉన్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇక్కడకు రోగులు వస్తూనే ఉంటారు. ఇక్కడ గర్భిణీ స్త్రీల సంరక్షణ కేంద్రం ఉంది. గతంలో వదిలిపెట్టిన పాత ఆస్పత్రి భవనాలున్నాయి. వాటిని ఉపయోగిస్తే పడకలు పెంచినా సరిపోతుంది. పరిమితమైన పడకల వల్ల రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అరకొర వైద్యుల వల్ల గంటలకొద్దీ రోగులు వేచి ఉండాల్సి వస్తున్న పరిస్థితి నెలకొంది.

అవస్థలు పడుతున్నాం

దశాబ్దాలుగా పేరొందిన రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో నిత్యం సమస్యలు వెంటాడుతున్నాయి. పడకల సంఖ్య తక్కువగా ఉండడంతో అత్యవసర సమయాల్లో ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురు కూడా ఉండాల్సి వస్తోంది. వైద్యులు తక్కువగా ఉన్నారు. గంటలకొద్దీ వేచి ఉండాల్సి వస్తుంది. ఓపీ రోజూ ఎక్కువగా ఉండడం, వైద్యులు తక్కువగా ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వసతి సమస్య కూడా వేధిస్తోంది. అధికారులు స్పందించాలి.

– బాబూరావు, రాజేంద్రపాలెం

అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదిస్తాం



రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. దీనిని మొదట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టిలో ఉంచి ప్రాధాన్యతను వివరిస్తాం. ఇక్కడ ఓపీ ఎక్కువగానే వస్తుంది.ప్రసవాలు అధికంగానే జరుగుతాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ జమాల్ బాషా, డీఎంహెచ్‌వో, అల్లూరి జిల్లా

వరదల్లో ప్రజల మరణాల బాధ్యత
కూటమి ప్రభుత్వానిదే

- వరదలపై ముందే సమాచారం ఉన్నా పట్టని సీఎం చంద్రబాబు
- విజయవాడను ముంచిన ప్రభుత్వం
- బాధితులకు సాయం అందించడంలోను విఫలం
- వరద బాధితుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం
- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



సాక్షి,పాడేరు: భారీ వర్షాలు, వరదలపై వాతావరణశాఖ హెచ్చరికలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా విజయవాడను ముంచిందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా విజయవాడ నగరం మునిగిపోవడం, మరణాలు చోటుచేసుకోవడం, వేలాది మంది నిరాశ్రయులవ్వడం చాలా బాధాకరమన్నారు. వరదలపై ఐఎండీ సమాచారం, హెచ్చరికలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ప్రభుత్వ పెద్దలు ముందస్తు చర్యల్లో విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుడమేరు వాగులో వరద ఉధృతితో విజయవాడ నగరంలోని ప్రజల నివాసాలన్నీ మునిగేంతవరకు ముఖ్యమంత్రి చోద్యం చూడడం దారుణమన్నారు. నివాసాలన్ని నీట మునిగి కట్టుబట్టలతో సహాయం కోసం ఎదురు చూసిన వేలాదిమంది వరద బాధితులకు సకాలంలో సాయం అందించకపోవడం అన్యాయమన్నారు. వరద బాధితులంతా ఆకలితో అలమటించిన కూటమి ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. వరద బాధితులను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. వరదలతో ప్రజల ఆస్తులు, ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత పాలకుల పైనే ఉంటుందని, అయితే 50 మంది వరకు వరదలో ప్రజలు మృతి చెందారని, ఆ మరణాలకు కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, ఇతర ప్రభుత్వ పెద్దలంతా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని, వరదలతో నష్టపోయిన అన్ని కుటుంబాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకునేంతవరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన

సాక్షి,పాడేరు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పీహెచ్‌సీలో ఎఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చి వారికి స్టాఫ్‌నర్స్‌లుగా పదోన్నతులు కల్పించడంతో తమకు ఉద్యోగ భద్రత ఉండదని, వారంతా వాపోయారు. ప్రభుత్వం ఈ యోచనను విరమించుకోవాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

చింతూరు: స్థానిక ఏరియా ఆసుపత్రి ఎదుట వైద్యసిబ్బంది బుధవారం ఆందోళన నిర్వహించారు. జీవో నెం.115ను రద్దు చేయాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ప్రసాద్, కోటేశ్వరరావు, చిన్నారి పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



గిరిజనులకు నిత్యావసర సామగ్రిని పంపిణీ చేస్తున్న దారకొండ కాంట్రాక్టర్ రమేష్

సీలేరు: ఇటీవల కురిసిన వర్షాలతో జి.కే.వీధి మండలం దారకొండ ప్రాంతంలో తీవ్ర ఇబ్బందులకు గురైన దారాలమ్మతల్లి గుడి సమీపంలో దారపురం, నిమ్మచెట్టు గ్రామాల్లోని బాధిత 30 ఆదివాసీ కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, కూరగాయలను సివిల్ కాంట్రాక్టర్ చీర్ల రమేష్ బుధవారం పంపిణీ చేశారు.

ఆయన సేవలను పలువురు అభినందించారు. గ్రామస్తులు బర్స య్య, దేవేంద్ర, ఉమ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఆహారం అందజేస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: స్థానిక వరద బాధితులకు ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ బుధవారం ఆహారం పంపిణీ చేశారు. జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక శబరిఒడ్డు, సంతపాకలు, టోల్‌గేట్ ప్రాంతాలకు చెందిన వరద బాధితులకు ఆయన ఆహారాన్ని అందజేశారు. దీంతో పాటు వరదల కారణంగా జాతీయ రహదారి–30లో నిలిచిపోయిన లారీల సిబ్బందికి కూడా ఆయన ఆహారం పంపిణీ చేశారు.

పాడేరు ఎమ్మెల్యే నివాళి

సాక్షి,పాడేరు: పట్టణంలోని సినిమాహాల్ సెంటర్‌లోని వర్తక సంఘం నేత దోమదుల వెంకాయమ్మ(85) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. గత నెల రోజుల నుంచి ఆమె పక్షవాతంతో బాధపడుతున్నారు.ఇటీవలే ఆమె పెద్ద కుమారుడు వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందాడు.ఆ యన పెదకర్మను బుధవారం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్న తరుణంలో తెల్లవారు 4గంటలకు వెంకాయమ్మ మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ మంత్రి మణికుమారి, టీడీపీ నేత నాగరాజుతో పాటు వర్తక సంఘం, వివిధ సంఘాల నేతలంతా వెంకాయమ్మ వెంకాయమ్మ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకాయమ్మ అంత్యక్రియలను పాడేరులో నిర్వహించారు.



వెంకాయమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

మెరుగైన విద్య అందించాలి

గంగవరం : లోతట్టు ప్రాంతంలో గమ మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలలో విద్యా బోధన, వసతి, భోజన సదుపాయాలను ఆయన పరిశీలించారు.వసతి గృహాన్ని సందర్శించారు. అలాగే వంటశాలలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతిరోజూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని, మెరుగైన బోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పాఠశాల, వసతి గృహం రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పిల్లలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలను ప్రధానోపాధ్యాయులు బాలరాజు, ఉపాధ్యాయులు తహసీల్దార్ శ్రీనివాసరావుకు వివరించారు.



ఆశ్రమ పాఠశాలలోని వంటశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

ప్రజా సమస్యలపై చర్చ

కొయ్యూరు: మండల పరిషత్ మందిరంలో ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో పలు సమస్యలను సభ్యులు తెలియజేశారు. రేవళ్ల పేరిట యూ డైస్‌ను ఏర్పాటు చేసి కొత్త పాఠశాలను మంజూరు చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ రేవళ్లలో పాఠశాల సమస్యపై జెడ్పీతో పాటు కలెక్టర్‌కు కూడా తీర్మాణాన్ని పంపనున్నారు. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని రాజేంద్రపాలెం వైద్యుడు మనోజ్ఞకు సూచించారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలపై ఏవో ఉమాదేవి వివరించారు. గ్రామాల్లో తాగునీటి పనులను ఏఈ విశ్వతేజ తెలిపారు. మండలంలోని 30 యూనిట్ల గోకులంల కోసం మంజూరైన నిధులను ఏపీవో రాజు తెలిపారు. సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. డౌనూరు సర్పంచ్ భవానీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, వారిని బదిలీ చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో మేరీరోజ్‌ను ఎంపీపీ రమేష్ కోరారు. డీటీ సత్యనారాయణ, ఏవో బాలమురళీ కృష్ణ, ఈవోఆర్డీ ప్రసాద్, వైస్ ఎంపీపీ నూకాలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



డాక్టర్ మనోజ్ఞతో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

సాక్షి,పాడేరు/హుకుంపేట/జి.మాడుగుల/ డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/ గంగవరం: వినాయక చవితి ఉత్సవాలతో గత ఐదు రోజుల నుంచి పూజలు అందుకుంటున్న గణపతి ప్రతిమల ఊరేగింపు,నిమజ్జోత్సవం బుధవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులతో పాటు భక్తులంతా గణనాధుని విగ్రహాల ఊరేగింపులో సందడి చేసారు. పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి.ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహచలంనాయుడు,ఆలయ ఆధ్మాత్మిక కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో పాటు భక్తులంతా పాల్గొన్నారు. సాయంత్రం గణపతి విగ్రహన్ని పురవీధుల్లో ఊరేగించారు. హుకుంపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జి.మాడుగుల మండలంలో కోరాపల్లి , గంగవరం మండలంలోని జడేరు, బర్రిమామిడి, మోహనాపురం, ఎండపల్లి గ్రామాల్లో వినాయకుని ఊరేగింపు కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో డప్పువాయిద్యాలతో థింసా నృత్యాలు, వివిధ డ్రాన్సులతో పారుగెడ్డలో వినాయకుని నిమజ్జనం చేశారు. జి.మాడుగుల మండలంలోని ఉరుము గ్రామంలో సర్పంచ్ కిముడు రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తున్నట్టు కమిటీ సభ్యులు లక్ష్మణ్, రాంజీ, పోతురాజు, జయరాజు, సాయి తెలిపారు. జి.మాడుగుల, డుంబ్రిగుడలో భారీ అన్నసమారాధన జరిగింది. డుంబ్రిగుడలో జీసీసీ మేనేజర్ దామోదర్, ధనలక్ష్మి దంపతులు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఐటీడీఏ క్వార్టర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంవద్ద భారీ అన్నసమారాధన జరిగింది.



ఉరుము గ్రామంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



పాడేరులో వినాయక విగ్రహ నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు

చింతపల్లి: చింతపల్లి మండలం చింతలూరులో వైద్య శిబిరం కొనసాగుతుంది. పెద్దబరడా పంచాయతీ చింతలూరు గ్రామంలో అతిసారంతో నలుగురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా అధికారులు గ్రామంలో వారం రోజులు పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో లంబసింగి వైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీహెచ్‌వో మురళి, ఎంపీహెచ్‌ఎస్ పడాల్. ఎంఎల్‌హెచ్‌పీ రెణుక తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 42 మందికి వైద్యసేవలు అందజేసినట్టు జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యామిని ప్రియ తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేసి పలు సూచనలిచ్చామన్నారు. ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్‌ఎం సింహాద్రి, ఎంఎల్‌హెచ్‌పీ మురళి, హెచ్‌వీ రమణ, హెల్త్ అసిస్టెంట్ రాజుబాబు, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏలేశ్వరం ఎల్ఐసీ శాటిలైట్ బీఎం సుబ్బారెడ్డి

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఏలేశ్వరం ఎల్ఐసీ శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ ఎం.వి.సుబ్బారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాధాకుమారి, పి.గంగవరం గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని టి.జీవితేశ్వరిలను సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని.. ఆ వృత్తిలో కొనసాగుతున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. ఉపాధ్యాయుల సమాజ మార్గదర్శకులున్నారు. భావి తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పదో తరగతిలో 500 మార్కులు దాటి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాజమండ్రి ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ద్వారా నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. హెచ్‌ఎం సీహెచ్ రామకృష్ణ, ఎల్ఐసి ఏజెంట్లు జయకృష్ణ , సత్యనారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మి , ఉమాదేవి, చిట్టెమ్మ, వరలక్ష్మి, కృష్ణకుమారి, సీత, రూప, కళావతి, రాజ్యలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయ రూరల్): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో బుదవారం ఘనంగా నిర్వహించిన పౌష్టికార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్నారు. గ్రామస్తులకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ సేవలు గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం మండల కేంద్ర గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు స్వామి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గంగన్నదొర, సీడీపీవో సూర్యకుమారి, ఎంపీడీవో నగేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ మాణిక్యం,నాయకులు సింహాద్రి, కృష్ణమూర్తి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ప్రజాప్రతినిధులు

రహదారులకు మరమ్మతు చేయాలని డిమాండ్



కొజ్జరిగుడలో కోతకు గురైన వంతెన వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు



ఆందోళన చేస్తున్న సోలగంపుట్టు గ్రామస్తులు, నేతలు

పెదబయలు: మండలంలోని రూడకోట నుంచి జామిగుడ వరకు రోడ్డు దారుణంగా ఉందని, నాణ్యత ప్రమాణాలు పాటించలేదని సీపీఎం రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, మండల కార్యదర్శి సన్నిబాబు అన్నారు. ఆయా రోడ్డును వారు బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల ప్రజలను అనుసంధానం చేసే ఈ రోడ్డు పనులపై అధికారులు దృష్టి సారించలేదన్నారు. ఫలితంగా వర్షాలకు అధ్వానంగా మారిందన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని రోడ్డు కాంట్రాక్టర్, అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

అరకులోయ రూరల్: బొండం పంచాయతీ కరకవలస రైల్వే స్టేషన్‌కు ఆనుకుని రైల్వే రెండో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా కరకవలస బీటీ రోడ్డు శిథిలావస్థకు చేరిందని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. మండల కమిటీ సభ్యులతో వారు బుధవారం పర్యటించి రహదారులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే పనులు చేస్తున్న కాంట్రాక్టు నిర్లక్ష్యంతో సమీపంలో ఉన్న బీటీ రోడ్డు గోతులమయంగా మారిందని వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని కోరారు.

ముంచంగిపుట్టు: బరడ పంచాయతీ సోలగంపుట్టు గ్రామ సమీపంలో వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును వెంటనే నిర్మించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన చేశారు. కల్వర్టు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం, అధికారులు స్పందించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ బరడ నుంచి సోలగంపుట్టు రోడ్డు అధ్వానంగా ఉందని, నాసిరకంగా పనులు చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, కల్వర్టు, బిటి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు : అనంతగిరి మండలం కాశీపట్నం సబ్‌స్టేషన్ ఫీడర్‌లో మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం కాశీపట్నం, సీతంపేట, ఎస్ఆర్‌పురం, చిలకలగెడ్డ, దాసరితోట, జీలుగులపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పాడేరు డివిజన్ ఈఈ ఏపీఎస్‌ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.